క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అష్టాదళ పాద పద్మారాధన సేవ



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబా చంద్రశేఖర దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మరసంతో అభిషేకం చేశారు. అమ్మవారిని మంగళగౌరి అలంకారంలో అలంకరించి అనంతరం 108 వెండి పుష్పాలచే ప్రత్యేక పూజా కార్యక్రమం చేపట్టారు. అనంతరం అమ్మవారికి చీర, ఒడి బియ్యం సమర్పించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్రాచారి, సుబ్బాచారి, ఆరవేటి వాసు తదితరులు పాల్గొన్నారు.

'బార్' కార్యాలయానికి కంప్యూటర్ వితరణ



కంప్యూటర్‌ను ప్రారంభిస్తున్న బార్ అధ్యక్షుడు గోళ్ల జయకృష్ణ

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదుల సౌకర్యార్థం కంప్యూటర్‌ను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోళ్ల జయకృష్ణ మంగళవారం ప్రారంభించారు. అధ్యక్షుడు గోళ్ల జయకృష్ణ మాట్లాడుతూ రూ.25వేలు తన సొంత నిధులతో ప్రింటర్, న్యాయవాదుల ఉపయోగార్థం లా సాఫ్ట్‌వేర్‌ను కొనుగోలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ట్రెజరర్ ఖాద్రి, మధుయాదవ్, రియాజ్ బాను, శీలం ఓబులరెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేసిన నూతన ధర్మకర్తల మండలి సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని కోటా వీధిలో వెలసిన శ్రీబ్రహ్మానందీశ్వరస్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణస్వీకారం మంగళవారం ఈఓ లక్ష్మీనారాయణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దేవస్థానం చైర్మన్‌గా కోలా నాగభూషణం, ధర్మకర్తల మండలి సభ్యులుగా చిప్పగిరి ప్రసాద్, లక్ష్మీదేవి, అనుపూరి భాగ్యలక్ష్మి, విజయలక్ష్మి, ఇండ్ల ఉషారాణి, రాజ్యలక్ష్మితో పాటు ఎక్స్ అఫీషియో మెంబర్‌గా పురోహితుడు రాచకొండ మురళీకృష్ణ శర్మ ప్రమాణస్వీకారం చేశారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

నంద్యాల(సిటీ): నంద్యాల పట్టణంలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించే క్లాప్(క్లీన్ ఆంధ్రప్రదేశ్) ఆటో డ్రైవర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డికి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ డ్రైవర్ల కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని వారికి పెండింగ్ వేతనాలు సత్వరమే చెల్లించి, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డ్రైవర్లు శ్రీను, ఇమ్రాన్, నారాయణరెడ్డి, ఖాజా, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో కౌలు రైతులందరినీ ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మార్క్ కోరారు. మంగళవారం స్థానిక నరసింహయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని కోరారు. 2011 చట్టం ప్రకారం భూ యజమానికి సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. బ్యాంకుల ద్వారా కౌలు రైతులకు రుణాలు ఇప్పించాలని కోరారు. సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా సభ్యులు నరసింహులు, ఏలియా, ఓబులేసు, భాస్కర్, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణ శివారులోని వైఎస్సార్‌నగర్‌లో నివాసం ఉంటున్న లక్ష్మీనారాయణ(32) మంగళవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాలూకా సీఐ దస్తగిరిబాబు తెలిపిన వివరాల మేరకు.. ఓర్వకల్లు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ వ్యవసాయ కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలం క్రితం అప్పులు ఎక్కువ కావడంతో బాధ తాళలేక నంద్యాల పట్టణానికి పని కోసం వచ్చాడు. స్థానిక వైఎస్సార్‌నగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకొని రోజు వారీ కూలీకి వెళ్లేవాడు. ఈ క్రమంలో మంగళవారం మనస్థాపానికి గురై ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



దుకాణాల వద్ద వేచి ఉన్న ప్రజలు

పోటెత్తిన అభిమానం



ఆళ్లగడ్డలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు జనం నీరాజనం పలికారు. పట్టణం జన సునామీని తలపించింది. వర్షం కురిసినప్పటికీ ప్రజలు లెక్క చేయకుండా యాత్రలో పాల్గొని జగనన్నపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. జైజగన్ నినాదంతో పట్టణం ప్రతిధ్వనించింది. మహిళలు సైతం బస్సు యాత్ర ముందు నడిచారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వేచి ఉన్న మహిళలు



భారీ జనసందోహం మధ్య సాగుతున్న బస్సుయాత్ర





ఎమ్మెల్యేకు హారతి పడుతున్న మహిళలు, బస్సుయాత్ర ముందు నడుస్తున్న అభిమానులు, వైఎస్సార్‌సీపీ టోపీలు ధరించి ర్యాలీగా వస్తున్న అభిమానులు

వ్యాధి నిర్ధారణలో జాప్యం వద్దు

నంద్యాల టౌన్ : జగనన్న వైద్య శిబిరాల్లో రోగుల నుంచి తీసుకున్న నమూనాలను త్వరిత గతిన పరీక్షించి వ్యాధి నిర్ధారణలో జాప్యం లేకుండా చూడాలని జిల్లా లెప్రసి అధికారి, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ శారద బాయి ఆదేశించారు. మంగళవారం స్థానిక సర్వజన ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ల తో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇంటింటి సర్వే, వార్డు, గ్రామ సచివాలయాల్లో నిర్వహించిన వైద్య శిబిరాల్లో సేకరించిన శాంపిల్లను పక్కగా పరీక్షించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండ రిపోర్టులు ఇవ్వాలన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే వారి వివరాలు, వారికి పరీక్షలు నిర్వహించిన తేదీలు నమోదు చేయాలని సూచించారు. జిల్లా మలేరియా అధికారి కామేశ్వర రావు మాట్లాడుతూ డెంగీ, మలేరియా నిర్ధారణ, కేసుల వివరాల నమోదు విధిగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏవో చంద్ర శేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా లెప్రసి అధికారి శారద బాయి

డ్రై డే నిర్వహించాలి...

ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రై డే కార్యక్రమాన్ని పక్కగా నిరావహించాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వర రావు అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో సబ్ యూనిట్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆశ, ఏఎన్‌ఎంల సమన్వయంతో డ్రై డే నిర్వహిస్తూ, డెంగీ, మలేరియా వ్యాధులు నిర్ధారణ అయిన ప్రాంతాల్లో ఫాగింగ్, స్ప్రేయింగ్ తప్పని సరిగా చేయించాలన్నారు.

జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా మార్తమ్మ



మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా మార్తమ్మ, ఉపాధ్యక్షురాలిగా లక్ష్మీదేవి, సెక్రటరీగా అనురాధ, జాయింట్ సెక్రటరీగా మౌలాలి, కోశాధికారిగా హేమలతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నంద్యాల పరస్పర సహాయ సహకార జిల్లా మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి 29 మండలాల పొదుపు గ్రూపు మహిళలు, సభ్యులు హాజరయ్యారు. డీఆర్‌డీఏ పీడీ గతంలో ఆడిట్ నివేదికలు, సాధించిన ప్రగతి, రాబోయే ఏడాదిలో సాధించాల్సిన ప్రగతి గురించి చర్చించారు. గతంలో మాదిరి కాకుండా భవిష్యత్తులో పొదుపు మహిళలు స్వయం సహాయక సంఘ సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్, ఆఫీసు బేరర్స్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్ కొండయ్య మాట్లాడుతూ 9న దిశ ఆధ్వర్యంలో జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ప్రాజెక్టు మేనేజర్ దేగలయ్య, డీపీఎం ఐబీ దానం, బ్యాంకు లింకేజీ కో ఆర్డినేటర్ ఎల్లయ్య, ఏరియా కో ఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సమాజ్ వాదీ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా శివకృష్ణ యాదవ్



నియామక పత్రాన్ని అందజేస్తున్న పాశ్యం వెంకటేశ్వర్లు

నంద్యాల(సిటీ): సమాజ్ వాదీ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా శివకృష్ణ యాదవ్ ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక శ్రీనివాస జూనియర్ కళాశాలలో సమాజ్ వాదీ పార్టీ రాయలసీమ జిల్లాల కో ఆర్డినేటర్ సిద్దపు పాండురంగారావు యాదవ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాశ్యం వెంకటేశ్వర్లు, సోషలిస్ట్ థింకర్స్ ఫోరం అధ్యక్షుడు మధు బొట్టా యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాశ్యం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సమాజ్ వాదీ పార్టీ రాష్ట్రంలో అన్ని నియోకవర్గాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల నాయకులతో పోటీ చేయనున్నామన్నారు. దేశంలో అత్యధికంగా ఉన్న బహుజనులు రాజ్యాధికారానికి దూరమయ్యారన్నారు. అనంతరం నంద్యాల జిల్లా సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడిగా పెరుగు శివకృష్ణ యాదవ్‌ను ఎన్నుకుని, ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సమాజ్ వాదీ పార్టీ రాష్ట్ర నాయకురాలు ఫరీదా, కల్యాణ్ సింగ్, వనం వెంకటాద్రి, కార్తీక్ రాజు, రాజేష్ తదితులు పాల్గొన్నారు.

5న జన జాగృతి దివస్

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ఐటీడీఏ ప్రాంగణంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఈ నెల 15న జనజాగృతి దివస్‌ను నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ బి రవీంద్రారెడ్డి మంగళవారం తెలిపారు. గిరిజనులు తయారు చేసిన వస్తువులు, సేకరించిన ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ మేళాను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భారత ప్రభుత్వం తరఫున ట్రైబల్ కో ఆపరేటీవ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ శ్రీనివాస్ మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో గిరిజనులు తయారు చేసిన వస్తువులను, సేకరించిన అటవీ ఉత్పత్తులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ ఎస్ సురేష్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ పవన్‌కుమార్, వైకేపీ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కేజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులు ఉత్పత్తి చేసిన వస్తువులను పరిశీలిస్తున్న అధికారులు

మల్లన్న సన్నిధిలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి



అమ్మవారి ఆశీర్వచన మండపంలో మంత్రి మేరుగ నాగార్జున

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున మంగళవారం దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ డి.పెద్దిరాజు, అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చ కవేదపండితులు వారికి ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు. ట్రస్ట్‌బోర్డు మెంబర్లు హనుమంత్‌నాయక్, తస్నీరు ధర్మరాజు తదితరులు ఉన్నారు

సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ జగనన్నే సీఎం కావాలి

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి
- యాళ్లూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

గోస్పాడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిందేనని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం యాళ్లూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయనకు గ్రామంలో ఘన స్వాగతం లభించింది. నాయకులు, పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ఇప్పటి వరకు వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల తీరుపై ఆరా తీశారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శిల్పా రవి మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఏ ఒక్కరూ తమకు సంక్షేమ పథకాలు అందలేదన్న ఫిర్యాదులు రావడం లేదన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పథకాలు ఇంటి ముంగిటకు చేర్చామని చెప్పారు. గతంలో ఏ పథకం అమలు కావాలన్నా జన్మభూమి కమిటీల సిఫారసులు కావాల్సి ఉండేదన్నారు. తాను అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు కొనసాగిస్తామని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదమన్నారు.

టీడీపీ నాయకులకు మరోసారి బుద్ధి చెప్పాలి

నవరత్నాలపై తప్పుడు ప్రచారాలు చేస్తున్న తెలుగు దేశం నాయకులకు ఓటుతో మరోసారి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే అన్నారు. ప్రతి ఒక్కరూ నవరత్నాల్లో కనీసం రెండు మూడు పథకాలు మాకు లభించాయన్న ఆనందంతో ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శకుంతలమ్మ, వైస్ ఎంపీపీ జనార్దన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ రామసుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ బెక్కెం నాగేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కైప శివరామిరెడ్డి, రామచంద్రారెడ్డి, బెక్కెం రామేశ్వరరెడ్డి, కైప శ్రీనివాసరెడ్డి, బెక్కెం రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి

బైక్ ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రుద్రవరం: స్థానిక పాత పోస్టాఫీసు వద్ద మంగళవారం మోటార్ సైకిల్ అదుపు తప్పి కింద పడిన ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గురు మోహన్ అనే వ్యక్తి గ్రామంలోకి వెళ్తుండగా అడ్డొచ్చిన ఆవును తప్పించబోయి బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. గాయాలపాలైన అతడిని చికిత్స నిమిత్తం 108లో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మహిళపై దాడి

దొర్నిపాడు: మండలంలోని అర్జునాపురం గ్రామంలో ఓ మహిళపై దాడి చేయగా గాయపడిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన శ్రీదేవి, సరస్వతి అనే ఇద్దరు మహిళల మధ్య ఇంటి సందులో మట్టి, కంకర వేశారనే విషయంలో ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో సరస్వతీ.. శ్రీదేవిని పారతో తలపై కొట్టింది. దీంతో శ్రీదేవికి గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

దొర్నిపాడు: రైతులు ధాన్యం మద్దతు ధరకు విక్రయించుకోవాలంటే తప్పని సరిగా ఈ-క్రాప్ నమోదు చేయించివుండాలని ఎంపీడీఓ సుబ్బారెడ్డి మంగళవారం తెలిపారు. పంటకోతకు ముందు వివరాలను ఆర్‌బీకేలో తెలిపి కొనుగోలు షెడ్యూల్ చేయించుకోవాలన్నారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉండేలా ధాన్యంను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ధాన్యం విక్రయించే సమయంలో ఎటువంటి ఇబ్బంది ఎదురైనా, వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1967కు ఫోన్ చేయవచ్చన్నారు. గ్రామ వలంటీర్లు తమ క్లస్టర్ పరిధిలోని రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిపై ప్రణాళిక

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) పరిధిలో నివసిస్తున్న చెంచుగిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం కోవెల్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ నాగేంద్రప్రసాద్ ప్రణాళికను రూపొందించి మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ బి.రవీంద్రారెడ్డికి అందజేశారు. ఈ ప్రణాళికను గిరిజనుల సంక్షేమం కోసం అభివృద్ధి కోసం అమలు చేస్తే ఫలితాలు మెరుగ్గా ఉంటాయన్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

మహానంది : మండలంలోని తమ్మడపల్లె గ్రామం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ల వద్ద మంగళవారం రాత్రి బైకు అదుపు తప్పడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. అల్లినగరం గ్రామానికి చెందిన దంపతులు బైక్‌పై నంద్యాల నుంచి గ్రామానికి వస్తుండగా సూచిక లేకపోవడంతో స్పీడ్‌బ్రేకర్ గమనించకపోవడంతో అదుపుతప్పి కిందపడింది. దీంతో బైక్‌పై వెళ్తున్న ఇద్దరూ గాయపడ్డారు. వీరిని నంద్యాల ఆసుపత్రికి తరలించారు.



సాధికార యాత్రకు బయలుదేరుతున్న ఉయ్యాలవాడ నాయకులు, కార్యకర్తలు

సామాజిక సాధికార యాత్ర విజయవంతం

రుద్రవరం: ఆళ్లగడ్డ పట్టణంలో సోమవారం నిర్వహించిన సామాజిక సాధికార యాత్ర విజయవంతం అయ్యిందని అధ్యక్షులు, ప్రసాదరెడ్డి, కన్వీనర్ నాగేష్ తెలిపారు. ఏపీ జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి పిలుపుమేరకు మండలంలోని 21 గ్రామ పంచాయతీల నుంచి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు భారీగా తరలి వెళ్లి యాత్రను జయప్రదం చేశారన్నారు.



నర్సాపురం నుంచి ఆళ్లగడ్డకు బయలు దేరుతున్న వైఎస్సార్‌సీపీ అభిమానులు

అడుగులన్నీ ఆళ్లగడ్డవైపే

ఉయ్యాలవాడ : ఆళ్లగడ్డ పట్టణంలో నిర్వహించిన సామాజిక సాధికారిక బస్సు యాత్రకు ఉయ్యాలవాడ మండలం నుంచి 20 వాహనాల్లో వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు మంగళవారం సాయంత్రం తరలివెళ్లారు. జగనన్నే మా నమ్మకం అంటూ ఉరకలు వేసే ఉత్సాహంతో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ కసాని పుణ్యలక్ష్మీదేవి, మండల బూత్‌కమిటీ కన్వీనర్ పల్లె గురుప్రసాద్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకుల ఆధ్వర్యంలో యాత్రకు బయలుదేరారు.

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం సందర్భంగా అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైల క్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన శ్రీబయలు వీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా అర్చకులు విశేష పూజలు నిర్వహించారు.



చీకటి తెరలను చీల్చుకు వస్తూ..

తెల్లవారుజామున ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకోగా.. సూర్యుడు చీకటిని చీల్చుకుంటూ ఉదయించే దృశ్యం ప్రకృతి ప్రేమికులను కనువిందు చేసింది. మంగళవారం దొర్నిపాడు సమీపంలో ఈ దృశ్యం కనిపించింది. – దొర్నిపాడు